
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



‘రక్షణ’కు మంగళం

కేటీపీఎస్ ఓఅండ్ఎం (పాత ప్లాంట్) మూసివేతతో అక్కడ పని చేస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగాన్ని ఎత్తివేశారు. IIలో



పాలకులను ఓడించండి

ప్రజాసంక్షేమాన్ని మరిచిన పాలకులను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు పిలుపునిచ్చారు. IVలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 19°

జిల్లాలో ఆదివారం సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వాతావరణం కొంత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

నేడు భద్రాద్రికి ‘బలరాముడు’

అయోధ్య సరయూ నదీతీరంలో ప్రతిష్ఠించనున్న విగ్రహం

భద్రాచలంటౌన్: అయోధ్యలోని సరయూ నదీ తీరంలో ప్రతిష్ఠించే బలరాముడి విగ్రహాన్ని ఆదివారం భద్రాద్రి పుణ్యక్షేత్రానికి తీసుకురానున్నట్లు శ్రీ నృసింహ సేవా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణ చైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దానధర్మ చారిటబుల్ ట్రస్ట్, భార్గవ పిక్చర్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఈ విగ్రహాన్ని రథయాత్ర ద్వారా దేశంలోని పలు పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్తున్నారని, ఈ క్రమంలో భక్తుల దర్శనార్థం నేడు భద్రాచలం రానుందని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు శ్రీ అహోబిలం మఠంలో భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రథయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అమరుల త్యాగం వెలకట్టలేనిది

మృతవీరులకు ఎస్పీ నివాళి



నివాళులర్పిస్తున్న ఎస్పీ వినీత్, డీఎస్పీలు

కొత్తగూడెంరూరల్: ప్రజల రక్షణ కోసం పోలీసులు చేసే త్యాగం వెలకట్టలేదని, ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణకు పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లోని స్మారక స్థూపం వద్ద శనివారం ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భం మాట్లాడుతూ.. 1959 అక్టోబర్ 21న పంజాబ్‌కు చెందిన 21 మంది ఐటీబీపీ పోలీసులు చైనా దురాక్రమణను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తుండగా హాట్‌స్ప్రింగ్ ప్రాంతంలో భీకర పోరు జరిగిందని, అందులో 10 మంది భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. తీవ్రవాదం, ఉగ్రవాదం వంటి విచ్ఛిన్నకర శక్తులను అరికట్టి ప్రజల భద్రతకు భరోసా కల్పించడానికి అమరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజాసేవకు పునరంకితం కావాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓఎస్డీ టి.సాయిమనోహర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరు డీఎస్పీలు వెంకటేష్, రెహమాన్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరో బెటాలియన్‌లో..

లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఆరో బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధుల్లో అసువులు బాసిన వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏట వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమాండెంట్ బి.సీతారాం, నాగేశ్వరరావు, టి.కాళిదాసు, వీరన్న, ఎ.అంజయ్య పాల్గొన్నారు.

రాజకీయం.. బతుకమ్మకు దూరం

అందరినీ ఒకే చోట చేర్చేది పూల పండుగ

- కొన్నేళ్లుగా ఈ ఆటలో రాజకీయ నేతల సందడి
- ఈసారి బతుకమ్మలో చేతులు కలపని పార్టీలు
- ఎన్నికల ఒత్తిడితో ఇటువైపు చూడని నాయకులు



గతేడాది నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా తదితరులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. మరోవైపు తెలంగాణ ప్రజలు జరుపుకునే అతిపెద్ద పండుగలైన బతుకమ్మ, దసరా వేడుకలు వచ్చాయి. దీంతో నిత్యం జనాల్లో ఉండే రాజకీయ నాయకులు ఈసారి పండగలో తమ ప్రచారంతో సందడి చేస్తారనే భావన ఉండేది. కానీ చిత్రంగా ఈసారి దసరాలో రాజకీయ జోష్ తగ్గిపోయింది. ముఖ్యంగా బతుకమ్మ సందడిలో వారి ఊసే లేకుండా పోయింది. సద్దుల బతుకమ్మతో పండుగ ముగింపు దశకు చేరినా ఎక్కడా రాజకీయ హడావిడి కనిపించడం లేదు.

ఇతర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు..

దసరా పండుగ వచ్చిందంటే వివిధ ప్రాంతాల్లో పని చేసే వారంతా సొంతూళ్లకు వస్తారు. విద్యాసంస్థలకు సెలవులు రావడంతో బంధువులు, పిల్లాపాపలతో సందడి నెలకొంటుంది. ముఖ్యంగా ఈ తొమ్మిది రోజుల పాటు సాయంత్రం వేళల్లో ప్రతీ ఊరిలో, ప్రతీ గల్లీలో ఆడపడుచులు బతుకమ్మలు ఆడుతూ పండగకు మరింత శోభ తీసుకొస్తారు. యువకులు పూల సేకరణలో నిమగ్నమవుతారు. ఇలా కుటుంబమంతా జరుపుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా తమ ఉనికి చాటుకునేందుకు రాజకీయ నాయకులు ప్రయత్నిస్తుంటారు. కానీ ఈ ఏడాది మాత్రం వారి జాడే కనిపించడం లేదు.

సందడి సందడిగా..

బతుకమ్మ పండగ అంటే ఆడపడుచుల ఆటపాటలే ముఖ్యం. కానీ రాజకీయ నేతలు ఈ పండుగకు తమదైన టచ్‌ను ఇవ్వడం మొదలెట్టారు. గల్లీ స్థాయి నేతల నుంచి ఎమ్మెల్యే, ఎంపీ వరకు తమ పరిధిలోని ప్రాంతాల్లో కొంతకాలంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నారు. మహిళల పండుగైనా సరే.. అందులో వారు కూడా దూరిపోయి బతుకమ్మ పాటలు రాకపోయినా, నృత్యం తెలియకపోయినా తమదైన శైలిలో పాటలు పాడుతూ నాట్యాలు చేయడం పరిపాటిగా మారింది. మరోవైపు తమ నాయకుడే ఆడి, పాడుతుంటే తామేందుకు వెనుకబడి పోవాలంటూ సదరు నేతల అనుచరులు సైతం బతుకమ్మల్లో కాలు కదిపేవారు. ఆఖరికి బందోబస్తులో ఉన్న ఖాకీలు సైతం బతుకమ్మలో భాగమయ్యేవారు. కొన్నాళ్లుగా మహిళలను మించి పురుష రాజకీయ నేతలు బతుకమ్మ ఆటల్లో సందడి చేసిన ఘటనలు ప్రతి గ్రామంలోనూ కనిపిస్తున్నాయి.

విమర్శలు వచ్చినా తగ్గలే..

మహిళల పండుగలో రాజకీయ నాయకుల రంగప్రవేశంపై అనేక విమర్శలు వచ్చాయి. పండుగను రాజకీయం చేయడమేంటనే వాదనలు వినిపించాయి. పాదరక్షలతో ఆడటం, పండుగలో సినిమా పాటలు, డీజే సౌండ్స్ చేయడం పైనా అభ్యంతరాలు వెల్లువెత్తాయి. అయినా రాజకీయ నాయకులు వెనక్కు తగ్గలేదు. పైగా బతుకమ్మ అలంకరణపై ప్రత్యేకంగా పోటీలు నిర్వహించడం, విజేతలకు పట్టు చీరలు, వంటింటి సామగ్రి బహుమతులుగా ఇవ్వడం వంటి కార్యక్రమాలను తెరపైకి తెచ్చారు.

ఇప్పుడు సీన్ మారింది..

ఈసారి అసెంబ్లీ ఎన్నికలు రావడంతో బతుకమ్మ వేడుకల్లో రాజకీయ నేతల హల్‌చల్ ఎక్కువగా ఉంటుందని అంతా భావించారు. కానీ ఈసారి సీన్ రివర్స్ అయింది. అందరికంటే ముందుగా భారత రాష్ట్ర సమితి అభ్యర్థుల జాబితా ప్రకటించింది. ఎన్నికలకు రెండు నెలల ముందుగానే జాబితా రావడంతో ప్రచారం చేసుకునేందుకు అభ్యర్థులకు కావాల్సినంత సమయం లభించింది. మరోవైపు సదరు అభ్యర్థిపై అసంతృప్తితో ఉన్న నేతలు పార్టీ కార్యక్రమాల పట్ల అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఈసారి బతుకమ్మలో ‘గులాబీ’ సందడి తగ్గిపోయింది.

టెన్షన్ టెన్షన్

కాంగ్రెస్ పార్టీ నేతల్లోనూ బతుకమ్మ జోష్ లేకుండా పోయింది. అభ్యర్థుల ఎంపికకు కమిటీలు, సమీక్షలతో ఆ పార్టీ వడపోతలు ముమ్మరం చేస్తోంది. దీంతో పార్టీ తరఫున పోటీ చేసే భాగ్యం తమకు దక్కుతుందో లేదో అనే టెన్షన్ కాంగ్రెస్ పార్టీ ఆశావహుల్లో నెలకొంది. టికెట్ కోసం హైదరాబాద్, ఢిల్లీలకు చక్కర్లు కొట్టడంలోనే ఎక్కువ మంది బిజీగా ఉన్నారు. టికెట్ దక్కించుకునేందుకు పైరవీల్లో మునిగి తేలుతూ బతుకమ్మ వైపు రావడం లేదు. ఈ వేడుకలపై రాజకీయ పార్టీల ప్రభావం తగ్గడంతో వాటికి అనుబంధంగా ఉండే ఉద్యోగ, కార్మిక, యువజన, విద్యార్థి సంఘాలు సైతం ఈసారి బతుకమ్మకు దూరంగా ఉండిపోయాయి.

జంగ్ తెలంగాణ

భద్రాచలం బీజేపీ అభ్యర్థిగా ధర్మా

ఫోన్‌లో సమాచారం ఇచ్చిన ప్రకాశ్ జవదేకర్



భార్య సత్యవతితో కుంజా ధర్మ

భద్రాచలం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం బీజేపీ అభ్యర్థిగా కుంజా ధర్మా పేరు ఖరారైంది. ఈ మేరకు శనివారం ఆయనకు బీజేపీ అగ్రనేత ప్రకాశ్ జవదేకర్ ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. గతంలో ఇదే స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కుంజా సత్యవతి ఇటీవల మృతి చెందగా, ఆమె భర్త అయిన ధర్మాను అభ్యర్థిగా ప్రకటించారు. సత్యవతితో పాటే రాజకీయ ప్రయాణం సాగించిన ధర్మా పార్టీలోనూ పలు కీలక పదవులు నిర్వర్తించారు. ఈనేపథ్యాన ఆయనను ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

కుటుంబ, రాజకీయ ప్రస్థానం

భద్రాచలంలోని భగవాన్ దాస్ కాలనీలో నివాసముంటున్న కుంజా ధర్మా వయస్సు 58ఏళ్లు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన ఆయన తన భార్య సత్యవతి ఎమ్మెల్యేగా గెలవడంలో కీలకపాత్ర పోషించారు. కాగా, 1980 నుంచి 94 వరకు సీపీఎం అనుబంధ సంఘాలైన ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల్లో పనిచేశారు. 1994 నుంచి 2000 ఏడాది వరకు ఆల్ ఇండియా అగ్రికల్చర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా, 2001 నుంచి 2005 వరకు దుమ్ముగూడెం జెడ్పీటీసీగా, 2006 నుంచి 2008 వరకు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా సేవలందించారు. అనంతరం 2009లో భార్య సత్యవతితో పాటు కాంగ్రెస్‌లో చేరి పలు పదవులు చేపట్టారు. 2010–2012 వరకు వైఎస్సార్ కాంగ్రెస్ జిల్లా కన్వీనర్‌గా, మళ్లీ 2012–14 వరకు కాంగ్రెస్ జిల్లా కమిటీ సభ్యుడిగా, 2014–17వరకు భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2017లో బీజేపీలో చేరిన ధర్మా కొద్దిరోజులు జిల్లా ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా పనిచేస్తున్నారు.

ఎడతెగని ఎదురుచూపులు

- కాంగ్రెస్ మలి దశ జాబితాకు కౌంట్‌డౌన్
- టికెట్ల సాధనకు హస్తినలో నేతల మకాం
- సీపీఐకి కొత్తగూడెం, సీపీఎంకు వైరా అంటూ ప్రచారం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ తరఫున ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నియోజకవర్గాల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాపై ఉత్కంఠ కొనసాగుతోంది. టికెట్ సాధన కోసం ఆశావహులు పలువురు హస్తినలో మకాం వేసి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఢిల్లీకి వెళ్లారు. మొదటి జాబితాలో రాష్ట్రవ్యాప్తంగా 55 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. అందులో ఉమ్మడి జిల్లా నుంచి రెండు స్థానాలున్నాయి. మిగిలిన స్థానాలకు ఒకటి, రెండు రోజుల్లో జాబితా విడుదల కానున్నట్లు తెలిసింది. అయితే, సీపీఎం, సీపీఐతో పొత్తు వ్యవహారంలో పీటముడి వీడకపోగా.. ఉమ్మడి ఖమ్మంలో ఒక్కో స్థానాన్ని సీపీఐ, సీపీఎంకు కేటాయించేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు అంగీకరించినట్లు తెలిసింది. అయితే చర్చలు పూర్తికాకున్నా వైరా స్థానాన్ని సీపీఎంకు కేటాయిస్తారనే ప్రచారంతో కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు.

సాధనాశూరులు

ఉమ్మడి జిల్లా నుంచి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. జనరల్ స్థానాల్లో అభ్యర్థులు దాదాపు ఖరారైన నేపథ్యాన రిజర్వ్‌డ్ స్థానాల్లోనూ తీవ్ర పోటీ ఉన్నందున అభ్యర్థులపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే మధిర, భద్రాచలం రిజర్వ్ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్‌లనే ప్రకటించింది. జనరల్ స్థానాలైన ఖమ్మంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరులో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్లు ఖరారైనట్లే. ఇక కొత్తగూడెం సీపీఐకి కేటాయిస్తే.. సత్తుపల్లి, వైరా, పినపాక, ఇల్లెందు, అశ్వారావుపేట అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఈనేపథ్యాన సీఎల్పీ నేత భట్టి, పొంగులేటి ఢిల్లీలోనే ఉండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

ఆ స్థానాల్లో హాట్.. హాట్

ప్రధానంగా వైరా, సత్తుపల్లి, ఇల్లెందు నియోజకవర్గాలకు సంబంధించి ఎక్కువ మంది టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇల్లెందు నుంచి ఏకంగా 32 మంది దరఖాస్తు చేసుకోగా.. పార్టీని అంటిపెట్టుకుని ఉన్నవారికే టికెట్ ఇవ్వాలన్న ఆందోళనలు జరుగుతున్నాయి.అయితే సీపీఐ, సీపీఎంతో పొత్తు ఖాయమన్న సమాచారంతో కొత్తగూడెం సీపీఐకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. భద్రాచలం స్థానాన్ని తొలి జాబితాలోనే కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేకే కేటాయించడంతో సీపీఎం ఆశించిన స్థానాన్ని కోల్పోయినట్లయింది.

అష్టైశ్వర్య ప్రాప్తిరస్తు

- ఐశ్వర్యలక్ష్మిగా శ్రీ లక్ష్మీతాయారమ్మవారు
- నేడు వీరలక్ష్మిగా దర్శనం
- 24న శమీ, ఆయుధ పూజ, శ్రీరామలీలా మహోత్సవం

భద్రాచలం: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకురాలిగా, కరుణాస్వరూపినిగా అష్టైశ్వర్య ప్రాప్తిరస్తు అంటూ దీవిస్తున్న అమ్మవారిని దర్శించుకున్న భక్తులు నీరజనాలు పలికారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శనివారం ఐశ్వర్య లక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కాగా, చిత్రకూట మండపంలో వేద పండితులు, అర్చకులు యుద్ధకాండ పారాయణం చేశారు.

నేటి వీరలక్ష్మి అలంకార విశిష్టత

‘దారిద్ర్య ధ్వంసినీం దేవీం సర్వోపద్రవవారిణీం’ అని అమ్మవారిని వీరలక్ష్మిగా కీర్తిస్తుంది పురాణం. దారిద్ర్యాన్ని, అన్ని రకాల ఉపద్రవాలను పారదోలే వీరత్వం ఈ అమ్మ సొంతమని, త్రిమూర్తులకు సైతం సాధ్యం కాని మహిషాసురిడిని ముగ్గురమ్మల శక్తి స్వరూపంగా ఆవిర్భవించిన అమ్మవారు సంహరించిందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ అమ్మను ఆరాధిస్తే అన్ని రకాల దుష్ట శక్తులు, భయాలు, ఉపద్రవాలు తొలగిపోతున్నాయని పండితులు అంటున్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారికి శనివారం సువర్ణ తులసీ అర్చన చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

24న విజయదశమి వేడుకలు..

ఈనెల 24న విజయదశమిని పురస్కరించుకుని విజయోత్సవం, శమీ పూజ, ఆయుధ పూజ, శ్రీ రామలీలా మహోత్సవం జరగనున్నాయి. 28వ తేదీ పూర్ణిమ రోజున శబరి స్మృతియాత్ర నిర్వహణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఐశ్వర్యలక్ష్మి అలంకరణలో అమ్మవారు

నిరంతర నిఘా ఏర్పాటు చేస్తాం



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఐడీఓసీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ ప్రారంభోత్సవం తర్వాత ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉందని, తనిఖీల సందర్భంగా ఆధారాలు లేకుండా లభించిన నగదు, విలువైన వస్తువులు, బహుమతులు తదితర సామగ్రిని ట్రెజరీ అధికారుల పర్యవేక్షణలో ఉంచేందుకు స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, సహకార అధికారి వెంకటేశ్వర్లు, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, ఏటీఓ మీనాక్షి, ఎస్‌టీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మార్గదర్శకాలు పాటించాలి..

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో పట్టుబడే నగదు, బంగారం సీజ్ చేసేటప్పుడు ఈసీ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన 1950 నంబర్‌కు లేదా సీ విజిల్ యాప్‌లో కానీ ప్రజలు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించామని తెలిపారు. 1950 నంబర్‌కు ఇప్పటివరకు 698 ఫిర్యాదులు రాగా 697 పరిష్కరించామని, ఒక దరఖాస్తు పెండింగ్‌లో ఉందని చెప్పారు. సీ విజిల్ యాప్‌నకు 27 ఫిర్యాదులు రాగా 16 పరిష్కరించామని, మిగిలిన 11 సమస్యలను ఫిర్యాదుదారులే రద్దు చేసుకున్నారని వివరించారు.

ఈవీఎం, కంట్రోల్ రూమ్‌ల పరిశీలన..

ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రతి యూనిట్‌ను నిశితంగా పరిశీలన చేయాలని కలెక్టర్ ప్రియాంక అన్నారు. శనివారం ఆమె ఈవీఎం, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం ర్యాండమైజేషన్ నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 1,095 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు పంపిస్తున్నామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, కొత్తగూడెం ఆర్డీఓ శిరీష పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామాయణ పారాయణం


పారాయణం చేస్తున్న భక్త మండలి సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని చిన్న జీయర్‌మఠంలో ఏపీలోని కాకినాడకు చెందిన అభయాంజనేయ స్వామి భక్తమండలి ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులు శనివారం రామాయణ పారాయణం నిర్వహించారు. దేవి నవరాత్రుల సమయంలో 15 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు భక్త మండలి నిర్వాహకురాలు ఏలేశ్వరం ఆదిలక్ష్మి తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాద్రిలో రామాయణ పారాయణం పఠించడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సామ శ్రీరాములు, మాసిన వీరభద్రరావు, సత్యవతి, బుల్లెమ్మ, లలిత, సుధా తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బతుకమ్మ


బతుకమ్మతో ఎస్పీ వినీత్ దంపతులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎస్పీ వినీత్, ఆయన సతీమణి ప్రీతి పాల్గొన్నారు. వారితోపాటు మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీ రెహమాన్, వెంకటేశ్, రాఘవేంద్రరావు, రమణమూర్తి, శ్రీనివాసరావు, సీఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


దాతలకు రశీదు అందజేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు విరాళం ప్రకటించారు. హైదరాబాద్ బహదూర్‌పల్లి కాలనీకి చెందిన వై.పావని తన భర్త వైఎంఆర్‌కే దాస్ జ్ఞాపకార్థం శనివారం రూ.లక్ష చెక్కును ఈఓ రమాదేవికి అందజేశారు. అనంతరం దాత కుటుంబీకులతో కలిసి స్వామిని దర్శించుకోగా, అర్చకులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.

కోర్టు ఉద్యోగి పదవీ విరమణ


ఆనందరావును సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం లీగల్: కొణిజర్ల మండలం పెద్దమునగాలకు చెందిన ముళ్లగిరి ఆనందరావు ఖమ్మం కోర్టులో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తుండగా.. శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను అడిషనల్ పీపీలు ఘనంగా సన్మానించి పీపీలు, సీడీఓలు, కోర్టు హోంగార్డులు కలిపి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని డిప్యూటీ డైరెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పీపీలు, హోంగార్డులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కొండముచ్చును ఢీకొట్టిన కారు


గాయపడిన కొండముచ్చు

పాల్వంచ: కారు ఢీకొట్టడంతో ఓ కొండముచ్చు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో భద్రాచలం రహదారిపై కొండముచ్చు రోడ్డు దాటుతుండగా అటుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో కొండముచ్చు కాలుకు తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా వచ్చి చికిత్స నిమిత్తం తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

‘రక్షణ’కు మంగళం

- కేటీపీఎస్ పాత ప్లాంట్‌లో ఎస్‌పీఎఫ్ ఎత్తివేత
- బీటీపీఎస్, వైటీపీఎస్‌లకు సర్దుబాటు
- బదిలీపై వెళ్లిన సిబ్బంది
- స్టోర్స్‌లో ఇంకా విలువైన పరికరాలు అనేకం


కేటీపీఎస్ పాత ప్లాంట్

పాల్వంచ : కేటీపీఎస్ ఓఅండ్ఎం(పాత ప్లాంట్) కర్మాగారం మూసివేతతో అక్కడ పనిచేస్తున్న ఎస్‌పీఎఫ్ (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) విభాగాన్ని ఎత్తేశారు. 720 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల పాత ప్లాంట్‌ను 2018లో మూసేయగా సుమారు 800 మంది ఉద్యోగులు, కార్మికులు ఇతర కర్మాగారాలకు బదిలీ అయ్యారు. ఇక ఇప్పటివరకు కర్మాగార రక్షణ బాధ్యతలు చూస్తున్న ఎస్‌పీఎఫ్ సిబ్బందిని సైతం భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(మణుగూరు), యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్(దామరచర్ల)లో సర్దుబాటు చేశారు. ఒకేసారి 107 మంది సిబ్బందిని బదిలీ చేయగా ఇటీవల రిలీవ్ ఆర్డర్లు అందజేశారు. ఈ బదిలీతో కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గినట్టయింది. ఇక కేటీపీఎస్ 5,6,7 దశల కర్మాగారాల్లో మాత్రమే ఎస్‌పీఎఫ్ పోలీసులు విధులు నిర్వహించనున్నారు. ఓఅండ్ఎం ప్లాంట్ స్టోర్స్‌లో ఇంకా విలువైన సామగ్రి, పరికరాలు ఉన్నాయి. ఎస్‌పీఎఫ్ సిబ్బంది తొలగింపుతో వాటి రక్షణకు ప్రమాదం పొంచి ఉందని, విలువైన పరికరాలు అపహరణకు గురయ్యే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

1992 నుంచి ఎస్‌పీఎఫ్ సెక్యూరిటీ..

1960లో కేటీపీఎస్ ‘ఎ’ స్టేషన్ నిర్మాణానికి అడుగు పడింది. కాలక్రమేణా 8 యూనిట్లుగా ఓఅండ్ఎం రూపాంతరం చెంది 720 మెగావాట్ల ఉత్పత్తి చేశారు. అనంతరం 5, 6 దశల్లో వెయ్యి మెగావాట్లు, 7వ దశలో 800 మెగావాట్ల ఉత్పత్తిని పెంచుకుంటూపోయారు. అయితే కాలం చెల్లిన ఓఅండ్ఎంను మూసివేయాల్సి రావడంతో అక్కడి ఉద్యోగులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కలిగిన ఏడో దశను అతి తక్కువ సిబ్బందితో నడిపిస్తుండటంతో ఇక్కడ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కాగా అప్పటివరకు ఏపీఎస్‌ఈబీ సెక్యూరిటీగా అక్కడి ఉద్యోగులే ఉండేవారు. సెక్యూరిటీ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ మొదలు వివిధ కేటగిరీల్లో రక్షణ బాధ్యతలు నిర్వహించారు. అయితే దీనిని మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో జెన్‌కో సంస్థ 1992లో ఎస్‌పీఎఫ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో అప్పటి వరకు ఇక్కడ సెక్యూరిటీ బాధ్యతలు నిర్వహించిన వారిని విద్యుత్ సౌధ, హైడల్ స్టేషన్‌లకు బదిలీ చేశారు. ఇక డిగ్రీ పూర్తి చేసిన వారిని జూనియర్ అసిస్టెంట్(ఎల్‌డీసీ)లుగా తీసుకున్నారు. వీరిలో అత్యధికంగా గత 2002, 2004 సంవత్సరాల్లో ఉద్యోగ విరమణ చేశారు.

> **బదిలీలు పూర్తయ్యాయి**
>
> కేటీపీఎస్ ఓఅండ్ఎం పాత ప్లాంట్ మూసివేతతో పాటు, అక్కడి సామగ్రిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాం. ఈ క్రమంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న 107 మందిని వైటీపీఎస్, బీటీపీఎస్‌లకు బదిలీ చేశాం. అందరికీ రిలీవింగ్ ఆర్డర్లు కూడా ఇచ్చాం.
>
> – అప్పాజీ, ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్

పట్టణాభివృద్ధిపై ప్రభావం..

కేటీపీఎస్ ఓఅండ్ఎంలోని వందలాది మంది ఉద్యోగుల బదిలీ పాల్వంచ పట్టణాభివృద్ధిపై భారీ ప్రభావం చూపించింది. క్రమంగా ఇతర విభాగాల సిబ్బంది సైతం బదిలీ అవుతుండడం, గత పదేళ్లుగా రిక్రూట్‌మెంట్ లేకపోగా, ఉద్యోగ విరమణలు ఎక్కువ అవుతుండటంతో ఉద్యోగుల సంఖ్య తగ్గుతోంది. గతంలో పది మంది చేసే పని ఇప్పుడు నలుగురు, ఐదుగురిపైనే పడిందని, పనిభారం తప్పడం లేదని ఉద్యోగులు సైతం వాపోతున్నారు. పట్టణంలో వ్యాపారాలు సైతం ఇక్కడి ఉద్యోగులపైనే ఆధారపడి నడుస్తుంటాయి. కొత్తగా ఎస్‌పీఎఫ్ బదిలీలు సైతం ఈ ప్రాంతం అభివృద్ధిపై కొంత ప్రభావం చూపుతాయని స్థానికులు అంటున్నారు.

తనిఖీల్లో రూ.8.32 లక్షల నగదు పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు నగదు పట్టుకున్నారు. స్థానిక ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న క్రమంలో ఏపీలోని కాకినాడకు చెందిన పోలా తిరుమల్ రాజు కారులో వరంగల్ వైపు వెళ్తుండగా ఆపి తనిఖీ చేయగా రూ.5 లక్షలు లభించింది. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద రూ.1.93 లక్షలు...

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు సీజ్ చేశారు. శనివారం మండలంలోని అల్లిపల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్తున్న రెండు కోళ్ల వ్యానుల్లో రూ.1,33,500, రూ.60,000 నగదును వేర్వేరుగా గుర్తించారు. తనిఖీల్లో పట్టుబడిన మొత్తం రూ.1,93,500 నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు.

సంపత్‌నగర్‌లో రూ.88 వేలు..


నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్‌ఐ

టేకులపల్లి: బోడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంపత్‌నగర్‌లో శనివారం ఎస్‌ఐ బత్తిని రంజిత్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆళ్లపల్లి మండలం రామాంజనేయగూడెం గ్రామానికి చెందిన సనప స్రవంతి తన మామయ్యతో కలిసి బైక్‌పై కొత్తగూడెం వెళ్తోంది. పోలీసులు బైక్ ఆపి తనిఖీ చేయగా స్రవంతి బ్యాగ్‌లో రూ.88 వేలు గుర్తించారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ వాసవీరాణికి అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాయకులగూడెం వద్ద రూ.50,700..

సుజాతనగర్: మండలంలోని నాయకులగూడెం వద్ద చుంచుపల్లి సీఐ పెద్దన్నకుమార్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టి ఎలాంటి ఆధారాలు లేని రూ.50,700 నగదును స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మక్కపేటకు చెందిన తేజా ఆధారాలు లేకుండా ద్విచక్ర వాహనంపై నగదును తీసుకెళ్తుండా పోలీసులు పట్టుకుని, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి రమేశ్‌కు సమాచారం అందించారు. తనిఖీల్లో ఎస్‌ఐ సోమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

బీఆర్ఎస్ లీగల్ సెల్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ


సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం లీగల్: రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తోందని, ప్రతీ న్యాయవాద కుటుంబానికి రూ.2 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ వర్తించేలా హెల్త్ కార్డులు అందించామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలో శనివారం బీఆర్ఎస్ లీగల్ సెల్ ఆధ్వర్యాన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో పోలిస్తే ఖమ్మం జిల్లా ఎంతో అభివృద్ధి సాధించిందని, ఇందుకు కృషిచేసిన తనను మరోమారు గెలిపించి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈసమావేశానికి బిచ్చాల తిరుమల రావు అధ్యక్షత వహించగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావుతో పాటు పొట్ల శ్రీకాంత్, కొత్తా వెంకటేశ్వరరావు, మామునేని మురళీధర్‌రావు, పొట్ల మాధవరావు, మల్లాది వాసుదేవరావు, మేకల సుగుణరావు, పసుపులేటి శ్రీనివాస్, వనం కృష్ణవేణి, ముక్తేశ్వరరావు, ఇమ్మడి లక్ష్మీనారాయణ, ఎక్కిరాల రాంబాబు, సింగం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడనే గెలిపించండి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో మరింత అభివృద్ధి జరిగేలా బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి వసంతలక్ష్మి కోరారు. నగరంలోని 55వ డివిజన్‌లో కార్పొరేటర్ మోతారపు శ్రావణి ఆధ్వర్యాన శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. అజయ్‌కుమార్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని పేర్కొన్నారు. సుడా డైరెక్టర్ కొల్లు పద్మతో పాటు షేక్ షకీనా తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఆర్పీసీ మిలిటెంట్లు అరెస్ట్

వివరాలు వెల్లడించిన భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: చర్ల మండలంలోని వెంకటచెరువు గ్రామ అటవీప్రాంతంలో చర్ల పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బందితో నిర్వహించిన వాహన తనిఖీల్లో మావోయిస్టు పార్టీకి చెందిన ఆర్పీసీ సభ్యుల (మిలిటెంట్లు)ను అరెస్టు చేసినట్లు భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. మావోయిస్టు పార్టీకి చెందిన ఆర్పీసీ సభ్యులైన ఉసూర్‌థానా, బీజాపూర్ జిల్లా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మడివి గంగమూడ (చిన్నఉట్లపల్లి) మడివి అంద (రాంపూర్) కొవ్వసి మంగు (భీమారం) పట్టుబడ్డారన్నారు. పూజారి కాంకేర్ ఆర్పీసీలో మిలీషియా సభ్యులుగా ఉంటూ మావోయిస్ట్ పార్టీకి కొంతకాలంగా సహకరిస్తున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. మావోయిస్ట్ అగ్రనాయకత్వం ఇటీవల అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో.. అందుకు సంబంధించిన కరపత్రాలను గ్రామాల్లో అంటించేందుకు బయలుదేరి తమకు చిక్కారని ఏఎస్పీ వెల్లడించారు. వారి వద్ద నుంచి 60 కరపత్రాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు. సమావేశంలో చర్ల సీఐ బి.రాజగోపాల్, ఎస్‌ఐలు టి.వి.ఆర్.నూరి, ఆర్.నర్సిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం చేసుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్


మద్యాన్ని చూపుతున్న అధికారులు

జూలూరుపాడు: మండలంలోని పలు రైస్ మిల్లులు, కల్యాణ మండపాల్లో శనివారం వైరా నియోజకవర్గ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో జూలూరుపాడులోని మద్యం గోదాము నుంచి బైక్‌పై ఓ వ్యక్తి మద్యాన్ని తీసుకెళ్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసులు పట్టుకున్నారు. ఆ వ్యక్తి వద్ద నుంచి 17 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.14,300 విలువ గల మద్యాన్ని అధిక ధర రూ 17,500కు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు విచారణలో వెల్లడైందని నవీన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఏఎస్‌ఐ తిరుపతిరావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ

ఇల్లెందు: మండలంలోని ఒడ్డుగూడెం – గంగారం మధ్య రెండు ద్విచక్ర వాహనాలుఢీకొన్నాయి. ఈ ఘటనలో చెక్‌పోస్టు రొంపేడు గ్రామానికి చెందిన బోడ శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం బోడ శ్రీను ఒడ్డుగూడెం నుంచి గంగారం వెళ్తుండగా వరంగల్‌కు చెందిన సాయికుమార్ బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీను భార్య ఖరిష్మా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అప్పారావు తెలిపారు.

రోడ్డు పక్కన నిలిపిన బైక్ చోరీ

ఇల్లెందు: రోడ్డు పక్కన నిలిపి ఉన్న బైక్ చోరీకి గురైన ఘటన శనివారం చోటుచేసుకుంది. పట్టణంలోని ఆదిత్య ఫర్టిలైజర్ షాపు పక్కన గల్లీలో నిలిపిన తన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని యజమాని చాగంటి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

టిప్పర్, యాష్ ట్యాంకర్ ఢీ

ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు


టిప్పర్, యాష్ ట్యాంకర్ ఢీకొన్న దృశ్యం

టేకులపల్లి: టిప్పర్, యాష్ ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం ఉదయం కొత్తగూడెం నుంచి టేకులపల్లి వైపునకు బొగ్గు లోడ్ కోసం టిప్పర్ వస్తోంది. ఇల్లెందు నుంచి కొత్తగూడెం వైపునకు యాష్ ట్యాంకర్ బయలుదేరింది. టేకులపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీ సమీపంలోకి రాగానే రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. టిప్పర్ డ్రైవర్ జాటోతు రాజ్‌కుమార్, యాష్ ట్యాంకర్ డ్రైవర్ ఎస్‌కే బాబా తీవ్రంగా గాయపడ్డారు. వారిని కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

26 మంది బెల్టు షాపుల నిర్వాహకులు బైండోవర్

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 26 మంది బెల్ట్ షాపు నిర్వాహకులను శనివారం ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. పడమటనర్సాపురం, మాచినేనిపేట, కొమ్ముగూడెం, భేతాళపాడు, కాకర్ల గ్రామాలకు చెందిన బెల్ట్ షాపు నిర్వాహకులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని జూలూరుపాడు తహసీల్దార్ శారద ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ సాయికుమార్, హెడ్‌కానిస్టేబుల్ ప్రకాష్‌రావు, సిబ్బంది కిరణ్, మౌనిక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండలంలోని గుండాలపాడు గ్రామసమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బూర్గంపాడు గ్రామానికి చెందిన రాసాల పాపారావు (33) మేకల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మేకల కొనుగోలు నిమిత్తం రోజూలాగానే తన ద్విచక్రవాహనంపై గుండాలపాడుకు బయలుదేరాడు. అయితే, గుండాలపాడు, పగడాలనగర్ అటవీ ప్రాంతంలోని రోడ్డుపై పాపారావు పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఆయన కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించగా అప్పటికే పాపారావు మృతిచెందాడు. కాగా, ఘటనా ప్రదేశానికి సమీపంలో ట్రాక్టర్ టైరు అచ్చులు ఉండంతో.. ట్రాక్టర్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని మృతుడి భార్య రాసాల సంధ్యారాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ తిరుమల్‌రావు తెలిపారు.

డెంగీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..


సాయికుమార్ (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి డెంగీతో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సున్నా వెంకటేశ్వరరావు, కళావతి దంపతుల కుమారుడు సాయికుమార్(26) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. జ్వరం వస్తుండటంతో మూడు రోజుల కిందట స్వగ్రామం రాగా కుటుంబసభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లాలని వైద్యులు సూచించగా శుక్రవారం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. సాయికుమార్ ఒక్కడే సంతానం కావడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

క్లుప్తంగా

జాతీయ ఆర్చరీ టోర్నీకి ఐదుగురు ఎంపిక



జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో శంకరయ్య

ఖమ్మంస్పోర్ట్స్: సంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ ఆర్చరీ ఎంపిక పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఐదుగురు ప్రతిభ కనబరిచారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు జైత్రయాత్ర కొనసాగించగా బాలుర జట్టులో కోయం లక్ష్మణ్, ఈర్ప నందు, కోడెం సర్వేశ్, బత్తుల అనిల్ మొదటి నాలుగు స్థానాల్లో, బాలికల విభాగం నుంచి షేక్ హస్న తృతీయస్థానంలో నిలిచింది. దీంతో ఈ ఐదుగురిని రాజస్థాన్‌లో నవంబర్ మొదటి వారంలో జరిగే జాతీయ స్థాయి టోర్నీకి ఎంపిక చేశారు. క్రీడాకారులను ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాదుల సారంగపాణి, పుట్టా శంకరయ్య, డీవైఎస్‌ఓలు టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఎం.పరంధామరెడ్డి, కోచ్‌లు జి.మారెప్ప, కల్యాణ్ అభినందించారు.

కాంకేర్ జిల్లాలో ఎదురుకాల్పులు

ఇద్దరు మావోయిస్టుల మృతి

చర్ల: తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో శనివారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనకు సంబంధించి బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.. కాంకేర్ జిల్లాలోని కోయిలిబెడా పోలీస్‌స్టేషన్ పరిధి గోమా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారన్న నిఘా వర్గాల సమాచారంతో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం గోమా అటవీ ప్రాంతంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు మొదలుపెట్టగా బలగాలు సైతం ఎదురుకాల్పులు జరిపాయి. హోరాహోరీగా సాగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా ఘటనాస్థలి నుంచి ఒక ఇన్‌సాస్ రైఫిల్, ఒక 12 బోర్ తుపాకీతో పాటు విప్లవ సాహిత్యం, నిత్యావసర సరుకులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఎదురుకాల్పు ల్లో పాల్గొన్న మావోయిస్టులు తప్పించుకొని పారిపోగా వారికోసం పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన మావోయిస్టులు ఆ దిశగా అటవీ ప్రాంత గ్రామాల్లో ప్రచారం చేస్తుండగా పోలీసులు పక్కా సమాచారంతో కూంబింగ్‌కు దిగగా ఈ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.

ఓపీఎస్‌ను మేనిఫెస్టోలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న శశిధర్

ఖమ్మం సహకారనగర్: సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేసి ఓపీఎస్(ఓల్డ్ పెన్షన్ స్కీమ్) అమలు చేస్తామని రాజకీయ పార్టీలు గతంలో హామీ ఇచ్చినందున.. వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ కోరారు. ఖమ్మంలో శనివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2.5లక్షల ఉద్యోగుల వినతి మేరకు ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఇప్పటికే పలు పార్టీలు మేనిఫెస్టోను ప్రకటించినా ఈ అంశం లేదని.. ఇకనైనా చేర్చాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేయాలనే డిమాండ్‌తో గత తొమ్మిదేళ్లుగా గ్రామస్థాయి నుంచి ఢిల్లీ వరకు పోరాడుతున్నందున తమ ఆవేదనను గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో నాయకులు ముత్తవరపు శ్వేత, బంగారయ్య, చంద్రశేఖర్, విజయ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఖమ్మం సత్తా

హోరాహోరీ పోరులో రన్నరప్‌గా నిలిచిన బాలుర జట్టు



ట్రోఫీ అందుకుంటున్న ఖమ్మం బాలుర జట్టు

రాజాపూర్: మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ టోర్నీ శనివారం ముగిసింది. బాలుర విభాగం ఫైనల్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టుతో తలపడిన ఖమ్మం జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. మహబూబ్‌నగర్-ఖమ్మం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. మొదటి సెట్‌లో పాలమూరు, రెండో సెట్‌లో ఖమ్మం జట్టు విజయం సాధించగా, హోరాహోరీగా సాగిన మూడో సెట్‌లో పాలమూరు జట్టు 15 పాయింట్లు, ఖమ్మం జట్టు 11 పాయింట్లు సాధించగా రెండో స్థానంలో నిలిచింది. ఈమేరకు విజేతతో పాటు రన్నరప్ జట్లకు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాంరెడ్డి ట్రోఫీలు అందజేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, హెచ్‌ఎం ఆనంద్‌కుమార్, ఎంపీడీఓ లక్ష్మీదేవి, పీడీలు వదన్న, వేణుగోపాల్, రాజవర్ధన్‌రెడ్డి, గజానంద్ పాల్గొన్నారు.

సమన్వయంతో కట్టడి చేద్దాం..

- ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి
- సరిహద్దు జిల్లాల అధికారులతో సత్తుపల్లిలో సమీక్ష



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ జనార్దన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు

సత్తుపల్లిటౌన్: తెలంగాణలో ఎన్నికల నేపథ్యాన ఇరు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే సరిహద్దు జిల్లాల నుంచి అక్రమంగా మద్యం, నాటుసారా, గంజాయి రవాణాను అరికట్టడం సాధ్యమవుతుందని ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. సత్తుపల్లిలో శనివారం ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా, ఏలూరు, తెలంగాణలోని ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల ఎక్సైజ్ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సరిహద్దుగా ఉన్న జగ్గయ్యపేట, నందిగామ, చింతలపూడి, తిరువూరు, కుక్కునూరు సరిహద్దు డివిజన్ల పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేయాలని తెలిపారు. ఇప్పటికే సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని వెల్లడించిన ఏలూరు, ఎన్టీఆర్ కృష్ణా జిల్లా అధికారులు.. 24 గంటల పాటు తనిఖీల ద్వారా అక్రమ మద్యం రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తెలంగాణ నుంచి ఆంధ్రాకు మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని ఈ నెలలో 12 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి నిఘాను మరింత పటిష్టం చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి సూచించారు. అలాగే, ఖమ్మం జిల్లాకు సరిహద్దున ఉన్న మేడిశెట్టివారిపాలెం, పేరువంచ, ముత్తగూడెం గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ జి.గణేశ్, ఖమ్మం, కొత్తగూడెం ఎక్సైజ్ సూపరింటెండెంట్లు నాగేందర్‌రెడ్డి, జానయ్య, ఖమ్మం, ఏపీకి చెందిన అధికారులు ఎం.సూర్యచంద్రరావు, ప్రసాద్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, కరంచంద్, ఎస్.సుబ్బారావు, సీఐలు వి.రాజశేఖర్‌రావు, ప్రసాద్, రమ్యరెడ్డి, నాగయ్య, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మరిచిన పాలకులను ఓడించండి..

- లౌకిక ప్రజాతంత్ర శక్తులను గెలిపించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలను మరిచి పాలన సాగిస్తున్న వారిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా పాలనలో తమ సొంత అజెండాను అమలు చేసిన వారికి తగిన సమాధానం చెప్పక తప్పదని హెచ్చరించారు. సీపీఐ ఖమ్మం జిల్లా సమితి సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్‌భవన్‌లో జరగగా కూనంనేని మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వాన అరాచక పాలన సాగుతోందని, ప్రశ్నించే గొంతులను నొక్కేసి ప్రజల హక్కులను కాలరాశారని ఆరోపించారు. ఆర్టీసీ, సింగరేణి సహా ఎక్కడా కార్మిక సంఘాలను బతకనివ్వలేదని తెలిపారు. నమ్ముకున్న, నమ్మిన వారిని మోసం చేయడమే కేసీఆర్ అజెండాగా మారిందని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.లక్షల కోట్ల అవినీతి జరగడమే కాక రాష్ట్రంలో ప్రజాధనం దుర్వినియోగమవుతున్నందున కేసీఆర్ ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దెదించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, కేంద్రంలో మోడీ నయా హిట్లర్ మాదిరి వ్యవహరిస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మతం మాటున రాజకీయాలు చేస్తున్న మోదీని ఇంటికి సాగనంపక పోతే దేశంలో ప్రజాస్వామ్యమే మరింత ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. కాగా, పొత్తులో భాగంగా సీపీఐ పోటీ చేసే స్థానాలతోపాటు, సీపీఐ మిత్రుల గెలుపునకు సమష్టి కృషి జరగాలన్నారు. సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావుతో పాటు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, మహ్మద్ సలాం, దండి సురేశ్, మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరించే వారు లేక..



గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో గోదావరి స్నానఘట్టాల వద్ద లోతును తెలిపేలా హెచ్చరిక బోర్డులు కరువయ్యాయి. బోర్డులు ఏర్పాటు చేయకున్నా కనీసం సూచనలు చేసేందుకు సిబ్బంది కూడా కానరావడం లేదు. భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి దర్శనానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. సెలవు రోజుల్లో రద్దీ మరింతగా ఉంటుంది. భక్తులంతా రామయ్య దర్శనానికి ముందు గోదావరిలో పుణ్యస్నానాలు చేయడం ఆనవాయితీ. అయితే, స్నానఘట్టాల లోతును తెలియజేసే బోర్డులు కానీ కంచె కానీ లేకపోవడంతో భక్తులు లోపలకు వెళ్తున్నారు. గత నెల వినాయక నిమజ్జనం సందర్భంగా ఓ బాలుడు గోదావరిలో గల్లంతయ్యాడు. ప్రస్తుతం దసరా సెలవుల్లో భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యాన ప్రమాదాలు జరగక ముందే స్నానఘట్టాలు, గోదావరి కరకట్ట పరీవాహక ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

స్తోత్ర మాలిక పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఈఓ రమాదేవి, ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: హైదరాబాద్‌లోని వేద విజ్ఞాన సమితి ఆధ్వర్యాన రూపొందించిన స్తోత్ర మాలిక పుస్తకాలను శనివారం భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలోని శ్రీలక్ష్మీ తాయారు అమ్మవారి సన్నిధిలో ఆవిష్కరించారు. భద్రాద్రి రామాలయ ఈఓ ఎల్.రమాదేవి ఈ పుస్తకాలను ఆవిష్కరించగా.. వేద విజ్ఞాన సమితి ప్రతినిధులు పాల్గొన్నారు. ఆ తర్వాత పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో కూడా పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో భద్రాచలం ఆర్టీసీ డీఎం రామారావు, దేవస్థానం ఉద్యోగులు, సమితి ప్రతినిధులు ఎస్.రామారావు, బొగ్గవరపు నర్సింహారావు, తూములూరి లక్ష్మీనరసింహారావు, పల్లా లింగయ్య, గజ్జి సూర్యనారాయణ, నాగేశ్వరరావు, యశ్వంత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితుల్లో పంటలు కాపాడుకోండి



మాట్లాడుతున్న డాక్టర్ ఉమారెడ్డి

వైరా: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యాన పంటలను కాపాడుకోవడంపై రైతులు శ్రద్ధ వహించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఉమారెడ్డి, మధిర వ్యవసాయ పరిశోధనా సంస్థ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ రుక్మిణీదేవి సూచించారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం అశ్వారావుపేట వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన రైతు సదస్సు నిర్వహించగా శాస్త్రవేత్తలు మాట్లాడారు. పంటలను కాపాడుకునే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు తిలకించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ శిరీష, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ శ్రావణ్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శైలజ, డాక్టర్ జెస్సీ సునీత, డాక్టర్ రవి, డాక్టర్ ఫణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

స్నానఘట్టాల వద్ద బురద తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

భద్రాచలంఅర్బన్: ఇటీవల భద్రాచలంలో గోదావరి వరద కారణంగా ఒడ్డున, స్నానఘట్టాల వద్ద బురద భారీగా పేరుకుపోయింది. దీంతో కర్మలు నిర్వహించేందుకు వస్తున్న భక్తులే కాకుండా పుణ్యస్నానాలకు వస్తున్న వారు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై శనివారం 'సాక్షి'లో 'బురదమయంగా స్నానఘట్టాలు' శీర్షికన కథనంప్రచురితమైంది. దీంతో స్పందించిన గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు చేసిన సూచనలతో సిబ్బంది రంగంలోకి దిగారు. పొక్లెయినర్ ద్వారా మట్టి తోడించి ట్రాక్టర్లలో తరలించారు. కాగా, పూర్తిస్థాయిలో మట్టి తొలగించి శుభ్రం చేయించేందుకు మరికొన్ని రోజులు పట్టే అవకాశముంది.



గోదావరి ఒడ్డున మట్టి తొలగిస్తున్న యంత్రాలు

ముగిసిన మత్స్యకారుల శిక్షణ



మత్స్యకారుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి: మండలంలోని పాలేరు మత్స్య పరిశోధన కేంద్రంలో సమీకృత చేపల పెంపకం అంశంపై మూడు రోజులుగా మత్యకారులకు ఏర్పాటుచేసిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన మత్స్యకారులు శిక్షణకు హాజరుకాగా, చివరి రోజు వనపర్తి జిల్లా పెబ్బేరు మత్స్య కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.భానుప్రసాద్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. శిక్షణలో నేర్చుకునే మెళకువలు పాటిస్తూ మత్స్య సంపదను అభివృద్ధి చేయడమే కాక మత్స్యకారులు ఎదగాలని సూచించారు. అనంతరం చేపల్లో వచ్చే వ్యాధులు, నివారణ మార్గాలు వివరించారు. పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడగా, శాస్త్రవేత్త రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది తొమ్మిది రోజులే!

ఓటు నమోదుకు ఇదే చివరి అవకాశం



కోనాయిగూడెంలో ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు (ఫైల్)

నేలకొండపల్లి: అర్హులైన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా ఎన్నికల సంఘం అనేక చర్యలు చేపడుతోంది. ఈనెల 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు కోసం దరఖాస్తుకు గత నెల 19వరకు అవకాశం కల్పించింది. ఈనెల 4న ఓటరు తుది జాబితా కూడా ప్రకటించారు. అనంతరం శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయటంతో అర్హులెవరైనా మిగిలి ఉంటే ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం నిర్ణయించారు. ఈనెల 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

పోలింగ్ శాతం పెంపే లక్ష్యంగా....

నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంపు, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంట్లో భాగంగానే మరోసారి నూతన ఓటర్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు. ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించగా.. ఓటరు జాబితాలో పేరు, చిరునామా, ఇతర వివరాల మార్పునకు మాత్రం వెసలుబాటు లేదు.

రామాలయ ఉప ప్రధాన అర్చకుడికి మెమో

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని ఉప ప్రధాన అర్చకుడికి ఆలయ ఈఓ ఎల్.రమాదేవి మెమో జారీ చేశారు. ఆలయ విధుల్లో నిర్లక్ష్యం, ఇతరత్రా కారణాలతో గతంలో పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోలేదని సమాచారం. దీంతో ఉప ప్రధాన అర్చకుడు శ్రీనివాసారామానుజాచార్యులకు శుక్రవారం మెమో జారీ చేసినట్లు తెలిసింది.

పలకరిస్తూ.. నమస్కరిస్తూ..

సత్తుపల్లిలో వెంకటవీరయ్య ప్రచారం



బజ్జీలు కాలుస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి: నమస్కారం.. బాగున్నారా.. మీరు మరోమారు ఓటు వేసి ఆశీర్వదించండి.. అంటూ సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శనివారం సాయంత్రం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిరువ్యాపారులు ఆయనకు కొబ్బరి నీళ్లు, టీ ఇస్తూ స్వాగతించారు. అలాగే, పాతసెంటర్‌లోని ఓ హోటల్‌లో బోండాలు, బజ్జీలు వేసిన ఎమ్మెల్యే ముందుకు సాగారు. తొలుత ఎన్నికల ప్రచారానికి రూపొందించిన పాటల సీడీని ఆయన ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావుతో పాటు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, వనమా వాసు, మట్టా ప్రసాద్, అద్దంకి అనిల్, ఎం.డీ.గఫార్‌ఖాన్, వేములపల్లి మధు, గోగులమూడి బాలాజీరెడ్డి, యుడీష్టర్, కొండపల్లి రమేష్‌రెడ్డి, ఎస్.కే.అబ్దుల్లా, వల్లభనేని పవన్, మల్లూరు అంకమ రాజు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి వెండి, బంగారపు చీర



చీరను ఆవిష్కరిస్తున్న ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు

పాల్వంచ : మండలంలోని శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారికి ఓ భక్తుడు వెండి, బంగారంతో నేసిన చీరను బహుకరించారు. దసరా రోజు అమ్మవారి అలంకరణ కోసం పట్టణంలో వసుంధర జ్యూయెలరీ యజమాని సంకా వెంకట రామారావు, రమాదేవి దంపతులు రూ.1.20 లక్షల విలువైన ఈ చీరతో పాటు అభిషేకానికి వినియోగించేందుకు రూ.25 వేల విలువైన వెండి శంకుధారను శనివారం అందజేశారు. ఈ చీరను సిరిసిల్లకు చెందిన చేనేత కార్మికులు నల్లా విజయ్ తయారు చేశారు. కాగా, నల్లా విజయ్ అగ్గిపెట్టెలో పట్టేలా నేసిన చీరను అమ్మవారికి బహూకరించారు. ఈ సందర్భంగా రామారావు దంపతులను అర్చకులు ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.రజినీకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, సభ్యులు చందుపట్ల శ్రీనివాస రెడ్డి, చింతా నాగరాజు, గంధం వెంగళరావు, మాలోతు సువాలి, బేతంశెట్టి విజయ్ కుమార్, పాయం పాపయ్య దొర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మణుగూరు సివిల్ జడ్జి ఎస్.వెంకటేశ్వర్లు అమ్మవారిని దర్శించుకున్నారు.

అమరుల స్మరణ అందరి బాధ్యత

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో శనివారం పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ పి.వెంకట్‌రాములు అమరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్మృతి పరేడ్ ద్వారా గౌరవవందనం సమర్పించారు. ఆతర్వాత కమాండెంట్ మాట్లాడుతూ పౌరుల భద్రతతో పాటు సమాజంలో శాంతిని నెలకొల్పే క్రమాన విధినిర్వహణలో బలైన పోలీసులను గుర్తు చేసుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ సహాయ దళాధిపతులు ఎం.ఉదయ్‌భాస్కర్‌రావు, ఆర్.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న కమాండెంట్, ఉద్యోగులు

దిగుబడి లేదు.. ధర రాదు

- బంతి సాగు చేసిన రైతుల్లో ఆవేదన
- పండుగ వేళ లాభాలు వస్తాయనుకుంటే నిరాశే





రఘునాథపాలెం వద్ద ఓ రైతు సాగు చేసిన తోటలో బంతిపూలు

రఘునాథపాలెం: వర్షాభావ పరిస్థితులు పంటలపైనే కాక పూలు సాగుచేసిన రైతులపై కూడా ప్రభావం చూపించాయి. వర్షాభావంతో బంతి తోటలు ఏపుగా పెరగగా.. పూల సైజు అనుకున్న స్థాయికి చేరలేదు. దీంతో తూకం సరిగ్గా రావడం లేదు. దీనికి తోడు గత ఏడాదితో పోలిస్తే ధర సగానికి పడిపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

డిమాండ్ ఉంటుందని...

గత ఏడాది జిల్లాలో పలువురు రైతులు బంతి సాగు చేపట్టారు. బతుకమ్మతో పాటు దసరా, దీపావళి, అయ్యప్ప మాలధారణ సమయాన పూలకు విపరీతమైన గిరాకీ ఉండడంతో కిలో ధర రూ.130 నుంచి రూ.150వరకు పలికింది. ఇంత ధర వెచ్చించినా కొన్నిసార్లు పూలు లభించలేదు. దీంతో ఈసారి కూడా డిమాండ్ ఉంటుందనే భావనతో మరికొందరు రైతులు కూడా సాగు చేశారు. ఖమ్మం జిల్లాలో సుమారు 500 ఎకరాల పైగానే బంతి సాగైనట్లు అంచనా.

ఎక్కడికక్కడే అమ్మకం

ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో రైతులు పలువురు తోటల్లో పూలుకోయడం లేదు. సాగు ఖర్చులకు తోడు కోత, మార్కెట్ తరలించే వ్యయం ఎందుకన్నట్లు భావిస్తున్నారు. ఇక కొందరు తోటల వద్దే వచ్చిన ధరే చాలన్నట్లుగా అమ్మకాలు చేస్తున్నారు. కాగా, నవంబర్ నెలలో పెద్దసంఖ్యలో వివాహాలు ఉండడం.. అదేనెల అయ్యప్ప మాలధారణ సీజన్, కార్తీక మాసం ఉండడంతో పూలకు గిరాకీ పెరుగుతుందని భావిస్తున్నారు. అదే జరిగితే తమ నష్టాలు కొంతైనా తగ్గుతాయనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

సాగు పైకి.. డిమాండ్ కిందకు...

గతంలో మాదిరి లాభాలు ఉంటాయనే భావనతో ఎక్కువ మంది రైతులు బంతి సాగుపై దృష్టి సారించారు. ఎప్పటిలాగే బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలతో పాటు అయ్యప్ప మాలధారణ సమయాన లాభాలొస్తాయని అనుకున్నారు. గత ఏడాది 100 నుంచి 150ఎకరాల్లో సాగు చేస్తే ఈసారి 500 ఎకరాలకు చేరడంతో డిమాండ్ పడిపోయింది. దీనికి తోడు తోటలు విరగబూసినట్లు కనిపిస్తున్నా వర్షాభావ పరిస్థితులతో సరిగ్గా ఎదగక తూకం రావడం లేదు. అంతేకాక ఎక్కువ మంది సాగు చేయడంతో పూలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యాన ధర కిలోకు రూ.60 నుండి రూ.70 దాటడం లేదు. ఫలితంగా పూలతో ప్రజలు పండుగ చేసుకుంటుండగా.. సాగు చేసిన తమకు మాత్రం నష్టాలే మిగిలాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.



తోట వద్దే అమ్మేస్తున్న రైతులు